సాక్షి
తిరుపతి

శుక్రవారం । 21 । జూన్ । 2024



గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

తిరుపతి జిల్లాలో గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. - 8లో



ప్రజోప'యోగ'ం!

ఉరుకులు, పరుగుల జీవితంలో యోగా ఆరోగ్య సాధనంగా మారింది. పలువురు యోగాపై ఆసక్తి చూపుతున్నారు. - 8లో



పీఎస్‌-4 హోటల్‌ సీజ్‌

తిరుపతిలోని పీఎస్‌–4 హోటల్‌ను కార్పొరేషన్‌ అధికారులు సీజ్‌ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హోటల్‌ను సీజ్‌ చేశారు. - 8లో

న్యూస్‌రీల్‌

కలెక్టర్‌కు ఆత్మీయ సత్కారం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టరేట్‌ ఉద్యోగులు

తిరుపతి అర్బన్‌: బదిలీ నేపథ్యంలో రిలీవ్‌ అయిన కలెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌కు కలెక్టరేట్‌ ఉద్యోగులు గురువారం ఘనంగా సత్కరించారు. ఏప్రిల్‌ 4వ తేదీ నుంచి కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ని మైనింగ్‌, జియాలజీశాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ క్రమంలో కలెక్టర్‌ గురువారం తిరుపతి నుంచి రిలీవ్‌ అయ్యారు. జాయింట్‌ కలెక్టర్‌గా పనిచేస్తున్న హెచ్‌ఎం ధ్యాన్‌చంద్రకు ఇన్‌చార్జి కలెక్టర్‌ బాధ్యతలు అప్పగించారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ నెల 26వ తేదీ బుధవారం హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందని ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి చిన్నారులను వారి తల్లిదండ్రులు తీసుకొచ్చి అక్షరాభ్యాసంలో పాల్గొనాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం



యం.వెంకట కిషోర్‌

తిరుపతి అర్బన్‌: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటామని ఆ విభాగం జిల్లా అధ్యక్షులు యం.వెంకటకిషోర్‌ స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటికి పరిష్కారం చూపించే దిశగా కృషి చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్న తమకు ఏపీ పంచాయతీ సెక్రటరీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ స్టేట్‌ జాయింట్‌ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలలో పారిశుద్ధ్య అధికారికి షోకాజ్‌ నోటీసు



నారాయణగిరి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమలలోని నారాయణ గిరి షెడ్ల వద్ద పారిశుద్ధ్య చర్యలపై ఈఓ శ్యామలరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారికి షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నారాయణగిరి షెడ్లను ఈఓ గురువారం పరిశీలించారు. అందులో భాగంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి వెళ్లే సర్వదర్శనం, స్లాటర్‌ సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం, భక్తులు తినే అన్నప్రసాదాలను, క్యూలైన్లను సందర్శించారు. యాత్రికులకు ఇబ్బంది లేకుండా దర్శనం కలిగించేందుకు ఇంజినీరింగ్‌ విజిలెన్స్‌ అధికారులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. నారాయణగిరి షెడ్ల వద్ద అపరిశుభ్రమైన ప్రాంగణాలు, చెప్పుల డంపింగ్‌, సరైన పారిశుద్ధ్య చర్యలు లేకపోవడంతో సంబంధిత అధికారికి షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్‌ పాల్గొన్నారు.

ఆశలు కూల్చి.. కన్నీళ్లు మిగిల్చి!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై భౌతికదాడులకు తెగబడుతున్నారు. ఇదివాలదన్నట్టు ఎన్నో ఆశలతో పైసాపైసా కూడబెట్టి నిర్మించుకున్న పేదల ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిపై పిడిగుద్దులు కురిపిస్తున్నారు. అక్రమణల పేరుతో దొంగనాటకమాడుతున్నారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని పేదలకు కన్నీళ్లే మిగుల్చుతున్నారు. తాజాగా గురువారం రేణిగుంటలో పేదలు నిర్మించుకున్న 65 రేకుల ఇళ్లను ధ్వంసం చేశారు. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



రేణిగుంటలో జేసీబీల సాయంతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు

- జిల్లాలో కొనసాగుతున్న పచ్చ దండు విధ్వంసం
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం
- పేదల ఇళ్ల కూల్చివేతపై సర్వత్రా విస్మయం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- రేణిగుంటలో పేదల రేకుల ఇళ్లు నేలమట్టం

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: గత ప్రభుత్వంలో నిరుపేదల జీవితాల్లో కొండంత భరోసా నింపి వారి మీద ఈగ వాలనివ్వకుండా కాపాడుకుంటూ వచ్చారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీ నాయకుల ఆగడాలకు హడలిపోతున్నారు. టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా ఓ వైపు భౌతిక దాడులకు దిగడమే కాకుండా వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం దగ్గరుండి దాడులను, కూల్చివేతల పర్వానికి పచ్చ జెండా ఊపుతున్నారు. ఆటవిక సామ్రాజ్యంలో అభాగ్యులు సమిధులవుతున్నారు. ప్రజలు అధికారమిచ్చింది ప్రతీకార దాడుల కోసమే అన్నట్లుగా రెచ్చిపోతున్నారు. తాజాగా గురువారం రేణిగుంటలో పేద దళితవర్గాలకు చెందిన సుమారు 65 రేకుల ఇళ్లను అక్రమ నిర్మాణాల సాకుతో అధికారులు నేలమట్టం చేసి తీరని నష్టాన్ని మిగిల్చారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చడమే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేస్తుంటే, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఇళ్లను కూల్చివేసి సుమారు రూ.5 కోట్ల మేర పేదల ఆస్తులకు నష్టం కలిగించారు. తాజాగా రేణిగుంటలోనూ గురువారం ఉదయం దళిత నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను హౌస్‌ అరెస్ట్‌ చేసి సీబీఐడీ కాలనీ సమీపంలో నిర్మించిన 25 ఇళ్లను కూల్చివేశారు. సుమారు 100 మంది పోలీసు, కేంద్ర బలగాలను మోహరింపజేసి బాధితులెవ్వరూ రాకుండా అడ్డుకున్నారు. అక్కడి నుంచి రేణిగుంట వివేకానంద కాలనీ సమీపంలో నిర్మించిన 40 ఇళ్లను కూల్చివేశారు. దీంతో కోట్ల రూపాయల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది. బాధితులు లబోదిబోమంటూ ఆర్తనాదాలు చేసినా అధికారులు కరుణించలేదు.

రేణిగుంట తహసీల్దార్‌ను నిలదీసిన మహిళలు



ఎవ్వరినీ రానివ్వకుండా పోలీసుల మోహరింపు

రేణిగుంట వివేకానంద కాలనీలో సుమారు 40 ఇళ్లను కూల్చివేశారు. దీంతో ఇళ్లు నిర్మించుకున్న పేద దళిత మహిళలు అక్కడకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేసినా వారిని పోలీసు బలగాలు దగ్గరకు రాకుండా కట్టడి చేశారు. తర్వాత తహసీల్దార్‌ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇళ్లన్నీ నేలమట్టం చేశారు. నిర్మాణాల తొలగింపు పూర్తయ్యాక, అక్కడి నుంచి బయల్దేరుతున్న తహసీల్దార్‌ను బాధిత మహిళలు అడ్డుకున్నారు. 'గతంలో తాము ఇళ్లు నిర్మించుకుంటున్నప్పుడు ఎందుకు అడ్డుకోలేదు.. ఎందుకు చోద్యం చూశారు.. ఇప్పుడెందుకు వచ్చి కూలగొట్టి మా బతుకులను వీధినపడేస్తున్నారు.. అప్పులు చేసి రేకుల ఇళ్లు నిర్మించుకుంటే ఏమిటీ దౌర్జన్యం' అంటూ నిలదీశారు. శాపనార్థాలు పెట్టారు. అయితే అధికారులు అక్రమ కట్టడాల సాకుతో కూల్చివేసిన ఈ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బాధితులకు అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీ, ఇంటి పన్నులను రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎలా ఇచ్చారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.



దగ్గరుండి పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు



జేసీబీతో విధ్వంస కాండ



పేదల ఆశల సౌధం నేలమట్టం



భారీగా మోహరించిన పోలీసులు

ఉమ్మడి జిల్లాలో ప్రతీకార దాడులు

- చిత్తూరు జిల్లా పరిధిలోని చిత్తూరు నగరానికి చెందిన హరి అనే వైఎస్సార్‌ సీపీ కార్యకర్తపై దాడి చేసి అతని సిగరెట్‌ గోడౌన్‌ కాల్చివేశారు. ఈ దాడుల్లో రూ.60లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.
- చిత్తూరు నగరానికి చెందిన రెండు చికెన్‌ బిర్యానీ దుకాణాలను ధ్వంసం చేసి రూ.10 లక్షలు నష్టపరిచారు.
- ఎస్‌ఆర్‌ పురంలో వైఎస్సార్‌ సీపీ ప్రచార రథాన్ని ధ్వంసం చేసి రూ.12 లక్షల వరకు నష్టపరిచారు. చిత్తూరులో కన్నన్‌ అనే వ్యక్తి బేకరీపై దాడి చేసి రూ.2లక్షలు నష్టం కలిగించారు.
- జీడీ నెల్లూరులో గౌతమి, గిరి, మోహన్‌, మురళి, కర్ణ ఇళ్లు ధ్వంసం చేశారు. ఈ విధ్వంసంలో రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం కలిగింది.
- పూతలపట్టులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బాబు, జయపాల్‌, నిరంజన్‌, కిరణ్‌, భారతి, లోకేష్‌పై దాడులు చేసి వారి ఇళ్లు, ఆటోలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో రూ.7 లక్షలు నష్టం వాటిల్లింది.
- యాదమరిలో బాబు, అలీ, అఫ్జల్‌, గుల్‌వీర్‌, ఉస్మాన్‌, మున్నీ, కబీర్‌, జాకీర్‌, సలీమ్‌, గౌస్‌బాషకు చెందిన లారీ, దుకాణం, బైక్‌, ఐదు ఇళ్లను ధ్వంసం చేశారు.

'నీట్‌'గా ముంచేస్తారా?

'బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతోంది. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాల్సిన ఎన్‌టీఏ సంస్థ అవినీతిలో కూరుకుపోయింది. దేశ వ్యాప్తంగా సుమారు 24లక్షల మంది విద్యార్థుల జీవితాలను బీజేపీ సర్వనాశనం చేసింది. నీట్‌లో 720కి 720 మార్కులు 67మందికి రావడం ఎలా సాధ్యమం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఇలాంటి స్కాంలు, కుంభకోణాలు జరగడం సిగ్గుచేటు. రూ.30 లక్షల ముడుపుల కోసం కక్కుర్తిపడి ప్రతిష్టాత్మకమైన నీట్‌ పరీక్ష పేపర్‌ను లీక్‌ చేసి విద్యార్థులను నట్టేట ముంచారు' అంటూ విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. నీట్‌ పరీక్షను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటించాయి.

- విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటం
- స్కామ్‌లు, కుంభకోణాలు ఇదేనా మోదీ మేక్‌ ఇన్‌ ఇండియా
- రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ అగమ్యగోచరం
- ఎన్‌టీఏ చైర్మన్‌, కేంద్రమంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- తిరుపతిలో కదం తొక్కిన విద్యార్థి సంఘాలు
- నీట్‌ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌



దండిమార్చ్‌ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: నీట్‌ పేపర్‌ లీకేజీపై నిరసనలు మిన్నంటాయి. జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు కథంతొక్కాయి. నీట్‌ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశాయి. ముడుపులకు కక్కుర్తిపడి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం మానుకోవాలని హితవు పలికాయి. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నష్టపోతున్నా సీఎం, డెప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్‌ నోరు మెదపకపోవడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు అక్బర్‌, రవి మండిపడ్డారు. గురువారం తిరుపతి ఎమ్‌ఆర్‌ పల్లి దండిమార్చ్‌ సర్కిల్‌ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నీట్‌ పరీక్ష రద్దు చేయాలని కోరుతూ బాధిత విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాత్రిపగలు కష్టపడి చదివి లక్షల రూపాయలు కోచింగ్‌కు వెచ్చించి డాక్టర్‌ కావాలన్న విద్యార్థుల ఆశలను బీజేపీ, ఎన్‌టీఏలు నాశనం చేశాయని ధ్వజమెత్తారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో పాటు ఎన్‌టీఏ చైర్మన్‌ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. సీఎం, డెప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్‌ వెంటనే మౌనం వీడి నీట్‌ స్కాంపై స్పందించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని సూచించారు. నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాల ఆధ్వర్యంలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని కోరారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు రంగప్ప, రమేష్‌ నాయక్‌, జిల్లా నాయకులు నాగేంద్ర, మౌనిక, భార్గవ్‌, శివ, బాల, సునీల్‌, సాయి, పెద్ద సంఖ్యలో నీట్‌ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు



ఎస్వీయూలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు, విద్యార్థులు

ఎస్వీయూలో కదం తొక్కిన ఏఐఎస్‌ఎఫ్‌

నీట్‌ ప్రశ్నపత్రం లీకేజ్‌లో ప్రధాన సూత్రధారులను గుర్తించి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, రాష్ట్ర నాయకులు చిన్ని డిమాండ్‌ చేశారు. నీట్‌ పరీక్ష రద్దు చేసి తిరిగి మళ్లీ పరీక్షను నిర్వహించాలని కోరుతూ ఎస్వీయూలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. ప్రపంచ యుద్ధాలను ఆపే సత్తా తమకుందని ప్రగల్భాలు పలికే మోదీ ప్రశ్నపత్రాల లీకేజీని ఎందుకు ఆపలేక పోయారని ఎద్దేవా చేశారు. పేద, బడుగు బలహీలన వర్గాల విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా శ్రమించి పరీక్ష రాస్తే వారి జీవితాలు గాడాంధకారంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను శిక్షించకపోతే దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులతో పార్లమెంట్‌ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు పార్టీలకతీతంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గళం విప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నవీన్‌, కార్యదర్శి ప్రవీణ్‌, ఎస్వీయూ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ చంద్రనాయక్‌, సురేష్‌నాయక్‌, బీసీ స్టూడెంట్‌ ఫెడరేషన్‌ నాయకులు తిరుమలేష్‌, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ డే



రెవెన్యూ డే సందర్భంగా కేక్‌ కట్‌ చేస్తున్న కలెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌, జేసీ, డీఆర్వో తదితరులు



మెడికల్‌ క్యాంప్‌

తిరుపతి అర్బన్‌: కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ కేక్‌ కట్‌చేసి సిబ్బందికి పంచి పెట్టారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా జిల్లా, డివిజన్‌, మండల స్థాయి అధికారులతో కలెక్టర్‌ మాట్లాడారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సిబ్బంది చేరువగా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. గ్రీవెన్స్‌, భూములు, తదితర సమస్యలకు సంబంధించిన సేవలపై బాధ్యతగా ఉండాలని చెప్పారు. రెవెన్యూ దినోత్సవాన్ని ప్రతి మండల, గ్రామ స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. జేసీ ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ అన్ని శాఖలకంటే రెవెన్యూశాఖ చాలా ముఖ్యమైందన్నారు. డీఆర్వో పెంచల కిషోర్‌ మాట్లాడుతూ రెవెన్యూ సేవలు క్రమంతప్పకుండా ఉండాలని పేర్కొన్నారు. స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ మురళి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్‌ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి, కలెక్టరేట్‌ ఏఓ గంగయ్య, రెవెన్యూ అసోసియేషన్‌ సభ్యులు, కలెక్టరేట్‌లోని రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్‌ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఏర్పేడు: ఉపాధిహామీలో ఏర్పాటు చేసే అమృత్‌ సరోవర్‌తో భూగర్భ జలాలు పెరుగుతాయని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌ అన్నారు. గురువారం మండలంలోని అముడూరులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ పొలాల్లో నీటి గుంటలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా చేస్తే రైతుల వ్యవసాయ బోర్లు, బావులకు భూగర్భ జలాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలను ఇవ్వాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రోజూ ఏర్పేడు మండలంలో 4 వేలు మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉపాధిహామీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సీడీసీ ఎల్‌ఆర్సీ చంద్రశేఖర్‌రాజు, జేఈ బాలాజీరావు, బీఎఫ్‌టీ వెంకటాద్రి, క్షేత్ర సహాయకుడు రవిచంద్ర, కూలీలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి
18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్‌ ఏటీజీహెచ్‌ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 79,584 మంది స్వామివారిని దర్శించుకోగా 31,848 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.41 కోట్లు సమర్పించారు. టైం స్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి క్రైమ్: మద్యం మత్తులో ఓ వ్యక్తి బుధవారం రాత్రి కానిస్టేబుల్ పై దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విద్యాసాగర్ తాగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అమాంతంగా మీదపడి దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ చేతిని గాయపరిచి పారిపోయాడు. ఆ వ్యక్తి తిరుపతిలో నివాసం ఉంటున్న సుబ్బరాజులుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నగరంలో తనిఖీ నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులను చూసి పరారయ్యేందుకు యత్నించిన ముగ్గురు యువకులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. వారు ఉమ్మడి జిల్లాలో నివాసముంటున్న దినేష్, అశోక్, మణికంఠ భూపతి వాసుగా గుర్తించామన్నారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి నగలు చోరీ


బాధిత మహిళ పెంచలమ్మ

కలువాయి: మండలంలోని కుల్లూరులో బుధవారం రాత్రి ఒంటరిగా నివసిస్తున్న మాలే పెంచలమ్మ అనే వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి నగలు చోరీ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలి కథనం.. బుధవారం అర్ధరాత్రి దాటాక పెంచలమ్మ బాత్ రూముకు వెళ్లి వచ్చి తన ఇంట్లో నిద్రించేందుకు పడుకుంది. ఆ సమయంలో ఇంట్లోకి చొరబడిన ఇద్దరు వ్యక్తులు పెంచలమ్మ కళ్లల్లో కారం కొట్టి ముఖంపై ముసుగువేసి గొంతు నులిమి చంపేస్తామని బెదిరించారు. అనంతరం ఆమె కాళ్లు, చేతులు కట్టేసి మెడలోని మూడున్నర సవర్ల సరుడు లాక్కుని, చేతికి ఉన్న గాజులు తీసే ప్రయత్నం చేశారు. ఈలోగా పక్కంటి వారు తన ఇంటి నుంచి వస్తున్న శబ్దాలను గమనించి రావడంతో దొంగలు గాజులు వదిలేసి సరుడు తీసుకుని వెళ్లిపోయారని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

కేంద్రీయ విద్యాలయం తరగతి గదుల ప్రారంభం

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శుక్రవారం కేంద్రీయ విద్యాలయం తరగతి గదులు ప్రారంభించినట్టు డైరెక్టర్ కేఎస్.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థుల కోసం తరగతి గదులు, స్పోర్ట్స్, మ్యూజికల్ గదులను ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదు
- స్పష్టం చేసిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేటటౌన్: జిల్లాలో గంజాయి, ఇతర అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. గురువారం నాయుడుపేట డీఎస్పీ, సీఐల ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విన్నమాల గ్రామసమీపంలో ఉన్న డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడ విధులను నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. అక్కడి నుంచి పట్టణంలో ఒకే చోట ఉన్న అర్బన్, రూరల్ సీఐల కార్యాలయాలను తనిఖీ చేశారు. స్టేషన్‌లలోని అన్ని గదులను పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్‌లో ఉన్న మహిళా పోలీసులతో మాట్లాడి ప్రతి రోజూ ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, ఎన్ని కేసులు నమోదు చేస్తున్నారు..? తదితరాలపై ఆరాతీశారు. పోలీస్ స్టేషన్‌ల ఆవరణలో పాత బైక్‌లు, తుప్పుపట్టిన వాహనాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూరల్ సీఐ కార్యాలయంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. అసాంఘిక కార్యాక్రమాలు జరుగుతు న్న 336 ప్రాంతాలను గుర్తించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సీఐ, ఎస్ఐలతో ఇప్పటి వరకు 125 చోట్ల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా పోలీసులతో ప్రత్యేక టీములు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఏర్పాటు చేసి జిల్లాలో గంజాయి ఇతర అక్రమ రవాణాలు జరిగే ప్రాంతలను గుర్తించినట్లు వివరించారు. ఫిర్యాదులతో వచ్చే వారితో పోలీసులు మంచిగా మసలుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీస్ వ్యవస్థను మరితంగా మేరుగుపరిచి ప్రజలతో పోలీసులు మమేకమవ్వాలని చెప్పారు. ఎస్పీ వెంట నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకట్రాది, అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి, పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


నాయుడుపేటలో మహిళా పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


బుచ్చినాయుడుకండ్రిగ : డీఎస్పీకి సూచనలు చేస్తున్న ఎస్పీ

చెక్‌పోస్టుల తనిఖీ

తడ: మండలంలోని బీవీపాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రంలోని ఎస్ఈబీ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. తొలుత తడ పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఆయన సిబ్బంది పరిచయం చేసుకుని పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీంలిచారు. అనంతరం బీవీపాళెం తనిఖీ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించారు. గంజాయి, అక్రమ మద్యం రవాణాపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తడ ఎస్ఐ నరశింహరావు ఉన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి జిల్లాలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని పరిస్థితులపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఇసుక అక్రమ రవాణా, బుచ్చినాయుడుకండ్రిగలోని ట్రాఫిక్‌పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. స్మగ్లింగ్‌ను ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ వెంకటాద్రి, ఎస్ఐ వెంకటనరసింహం, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీహరి, ఉ న్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు


శ్రీకాళహస్తి : వ్యర్థాల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. స్వర్ణముఖినదీ తీరంలో వాటర్ వర్క్స్ కాలనీ వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే 29 బహిరంగ ప్రదేశాలు మద్యం సేవించేవిగా గుర్తించామన్నారు. ఈ ప్రదేశాల్లో దశలవారీగా శుభ్రం చేయడం జరుగుతందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసుల కఠిన చర్యలు తీసుకుంటారని తేల్చి చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నోటీసు బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేసేందుకు సహకరించిన పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబును ఆయన ధన్యవాదాలు తెలిపారు.డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, 1వ పట్టణ సీఐ నరసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక శిక్షణ


లోకనాథం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

తిరుపతి అర్బన్: పీఎం కౌశల్ వికాస యోజన పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఆయా రంగాలలో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడానికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ కేంద్రాన్ని గతంలోనే ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిక్షణ సంస్థలో యువతకు అధునాతన శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతిపైన చదువుకున్న నిరుద్యోగుల్లో ఆసక్తి ఉన్న అందరికీ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, అదనపు సమాచారం కోసం 9700413939, 9866241270, 9676474274, 9703437472, 7981155147 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, తెలంగాణ మున్సిపల్ చైర్మన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్‌రెడ్డిరాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

279 బస్తాల తమిళనాడు బియ్యం స్వాధీనం

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పట్టణ సమీపంలోని వట్రపాళెం ప్రాంతంలో విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. చలువాది రవి అనే వ్యక్తి ఇంట్లో 279 బస్తాల్లో తమిళనాడు పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్టు సివిల్ సప్లయ్స్ డెప్యూటీ తహసీల్దార్ ఓబయ్య తెలిపారు. సమారు 13,700 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, చలువాది రవిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్టు వెల్లడించారు. దాడులో విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

వర్షాలపై సమీక్ష

తిరుమల: రాబోవు వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు గురువారం సాయంత్రం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో ఈ సమీక్ష జరిగింది. ఇందులో భాగంగా 1996, 2004, 2005, 2015, ఇటీవల 2021 సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్ రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. అనంతరం తిరుపతిలోని కళ్యాణి డ్యాంతో పాటు, భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి కూడా ఆయనకు వివరించారు. భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు. అనంతరం కొనుగోళ్లు, గిడ్డంగుల శాఖలపై కూడా ఈఓ సమీక్షించారు. సమీక్షా సమావేశాల్లో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీహరి, డీఈ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, జీఎం (కొనుగోలు) మురళీకృష్ణ, వేర్హౌజ్ డిప్యూటీ ఈవో పద్మావతి పాల్గొన్నారు.

తిరుపతిలో పీఎస్ -4 హోటల్ సీజ్


భోజనం ప్లేట్‌లో జెర్రి


సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు


ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

- పీఎస్-4 హోటల్‌లో దారుణం
- భోజన ప్లేట్‌లో జెర్రి
- గొడవకు దిగిన కస్టమర్లు
- కస్టమర్లను కొట్టడానికి వెళ్లిన హోటల్ సిబ్బంది
- హోటల్‌పై కేసు, జరిమానా

తిరుపతి తుడా: తిరుపతిలోని లీలామహల్ సమీపంలో ఉన్న పీఎస్-4పై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. హోటల్ నిర్వాహకులకు రూ.50 వేల జరిమానా విధించడంతోపాటు హోటల్‌ను సీజ్ చేశారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం పీఎస్-4 హోటల్‌లో యాత్రికులు భోజనం చేస్తుండగా బీట్‌రూట్ కర్రీ వడ్డించారు. తింటుండగానే కర్రీలో విషపూరితమైన జెర్రి కనిపించడంతో వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు హోటల్‌కు చేరుకుని కిచెన్ పరిసరాలను, పరిశుభ్రతను, వంటకు వినియోగించే వస్తువులను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హోటల్‌ను సీజ్ చేశారు.

జెర్రిపై ప్రశ్నిస్తే దాడికి దిగారు

తిరుపతి క్రైమ్: వాసు అనే వ్యక్తి పుత్తూరు నుంచి తిరుపతికి ఓ హాస్పిటల్లో పని ఉండి వచ్చాడు. ఈ క్రమంలో స్నేహితులతో కలిసి భోజనం చేసేందుకు లీలామహల్ సమీపంలోని పీఎస్-4 హోటల్‌కి వెళ్లాడు. భోజనం ఆర్డర్ చేశాడు. సిబ్బంది ప్లేట్లో అప్పడం, చపాతి, ఆయిల్ ఫ్రై, ఎండు మిరపకాయ వేశారు. ఆయిల్ ఫ్రైలో జెర్రి కనిపించింది. దీనిపై అతను అతని ప్రశ్నించగా హోటల్ సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. అక్కడ పనిచేసే వారు కూడా వాసును కొట్టడానికి వెళ్లారు. ఫిర్యాదు చేస్తామని గట్టిగా వాసు అరవడంతో హోటల్ సిబ్బంది కూడా కొద్దిసేపు గొడవ చేశారు. ఇంతలో వారి స్నేహితులు కార్పొరేషన్‌లోని ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు.

ప్రజోప'యోగ'ం!

- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- అంతా యోగభాగ్యాలపై దృష్టి
- సర్వత్రా పెరుగుతున్న ఆసక్తి
- నిత్య జీవితంలో భాగమవుతున్న వైనం
- మానసిక ప్రశాంతతకు దివ్య ఔషధం
- ఆలోచనాశక్తి ఏకాగ్రత పెంపుదలకు దోహదం




తిరుపతి అర్బన్: అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసే మహోన్నత శక్తి యోగా. ఇది భారతీయ పురాతన ప్రక్రియ. ఎందరో ఆచరించి ప్రయోజనం పొందిన దివ్యసాధనం. కాలక్రమేణా మరచిపోయిన శాస్త్రీయ వ్యాయామ సమ్మిళిత సంపద.. ఇప్పుడు మళ్లీ పురుడు పోసుకుంటోంది. జనుల నిత్య జీవనంలో భాగమవుతోంది. ఎందరో యోగాభ్యాసకులు నిరంతర సాధనతో అద్భుతాలను మన కళ్లెదుట ఆవిష్కరిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువులు, సాధకుల తిరుపతిలో యోగా శిక్షణకు సిద్ధమవుతున్నారు.

పోటీ ప్రపంచంలో యోగా తప్పనిసరి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనం గందరగోళంగా మారింది. మానసిక ఒత్తిళ్లతో అందరూ సతమతమవుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో యాతన అనుభవిస్తున్నారు. విపరీత ధోరణులు పెరిగి ఆలోచనాశక్తి నశించి క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీని నుంచి బయట పడేందుకు ఉన్న ఏకై క మార్గం యోగా సాధన. రోజూ కొంత సమయం యోగానలకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని యోగా గురువులు చెబుతున్నారు. యోగాసనాలపై అవగాహన, ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 100కు పైగా యోగా శిక్షణ కేంద్రాలు


రోగాలబారి నుంచి బయటపడి ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగించడానికి వేలాదిమంది జిల్లాలో వాకింగ్ చేస్తుంటే.. అదే స్థాయిలో యోగా శిక్షణా కేంద్రాల్లో రోజూ శిక్షణ తీసుకుంటూ ఆరోగ్యాన్ని రక్షించుకునే చర్యలు పలువురు చేపడుతున్నారు. వృధాప్యంలోనే కాకుండా చిన్నతనం నుంచే పిల్లలకు యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 32 లక్షల మంది జనాభాలో 10శాతం మంది యోగాలో భాగస్వాములవుతున్నట్లు యోగా గురువులు లెక్కలు గడుతున్నారు.


యోగాసనాలు వేస్తున్న వాసుదేవరెడ్డి

ఆరోగ్య 'యోగ'ం


తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని బైరాగిపట్టెడలో నివాసముంటున్న వాసుదేవరెడ్డి 2010లో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. చిన్నతనం నుంచే యోగాపై ఆసక్తి ఉన్నప్పటికీ ఉద్యోగ రీత్యా పూర్తి స్థాయిలో దానిపై దృష్టి సారించలేకపోయారు. పదవీ విరమణ అనంతరం పతంజలి యోగా సెంటర్‌లో శిక్షణ పొందారు. 2016 హరిద్వార్‌లో రామ్‌దేవ్ బాబా పర్యవేక్షణలో యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే 72 ఏళ్ల వయస్సులో 57 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేయడం రికార్డుకెక్కింది. ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఢిల్లీ)లో స్థానం సంపాధించి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. బెంగళూరులోని యోగా వర్సిటీ స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్ (ఎస్‌యూవైఏఎస్ఏ)లోనూ 2024 మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సును పూర్తి చేశారు. 30 రోజుల్లో రోజుకు 10 గంటల పాటు యోగా చేసి రికార్డుకెక్కారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం పదిలం



ప్రతి మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో వ్యాయామం అంతే అవసరం. ప్రతిఒక్కరూ రోజూ క్రమంతప్పకుండా వ్యాయామం చేయడంతో పూర్తి ఆరోగ్యాన్ని పొందొచ్చు. యోగాను ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలి. సూర్యనమస్కారం వంటి ఆసనాలు చేయడంతో మంచి ఆరోగ్యంతోపాటు రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండొచ్చు. – వాసుదేవరెడ్డి, యోగా ఇన్‌స్ట్రక్టర్

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం


మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్కావెంజర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి వాడలోని పేద పిల్లల విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ కాలనీలో వేమన విజ్ఞాన కేంద్రం వారు ఉచిత ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మల్లారపు నాగార్జునరెడ్డి, నారాయణ, టెంకాలయ దామోదరం, టి.మునిరత్నం, శేషకుమార్, సాగర్, బాలాజీ చౌదరి, రఫీ, రెడ్డెప్ప, వెంకటరమణ, కుప్పస్వామి, గురునాథం, ప్రధానోపాధ్యాయుడు కె.మునిరత్నం, మునీంద్ర, యానాది కాలనీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి కొర్లగుంట, మారుతీ నగర్‌కు చెందిన ఇ.హరికుమార్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతి, కోటకొమ్మల వీధికి చెందిన బి.పెరుమాళ్ రెడ్డి వద్ద హరికుమార్ 2016 సెప్టెంబర్ 3వ తేదీన నాలుగు లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని రెండు ప్రోనోట్లు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 218 ఆగస్టు 17వ తేదీ రూ.3 లక్షలు విలువ చేసే చెక్కును పెరుమాళ్‌రెడ్డికి ఇచ్చారు. అతను ఆ చెక్‌ను బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో తిరుమలరెడ్డి కోర్టులో హరికుమార్‌పై చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

